చనిపోతున్న చేపలు

- అడుగంటిన భూగర్భజలాలు
- ఆందోళనలో మత్స్యకారులు



ఎండిపోయిన పొరండ్ల ఊర చెరువు

జగిత్యాల రూరల్: భూగర్భజలాలు అడుగంటుతుండటంతో మత్స్యకారులు ఆందోళనకు గురవుతున్నారు. జగిత్యాల జిల్లాలోని చెరువులు, కుంటల్లో చేపలు పెంచుకుని జీవనోపాధి పొందుతున్న మత్స్యకారుల్లో చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో పెంచిన చేపలు మత్యువాత పడుతుండటంతో కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టిన మత్స్యకారులు తమకు జీవనోపాధి కరువవుతుందని ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో దాదాపు 1072 చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాలో 50–60 చెరువులు, కుంటల్లో మాత్రమే 50 శాతం నీరుండగా మిగతా చెరువులు, కుంటల్లో పూర్తిగా భూగర్భజలాలు అడుగంటాయి. మత్స్యకారుల కుటుంబాలు చేపల పెంపకంపైనే ఆధారపడి ఉన్నారు. గత సంవత్సరం భారీగా వర్షాలు కురిసి పూర్తి స్థాయిలో చెరువులు, కుంటలు నిండగా, ప్రస్తుతం వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో చెరువులు, కుంటల్లో నీటిమట్టం పూర్తిగా పడిపోయి ఎండిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో చెరువులు, కుంటల్లో వేసిన చేపలు కూడా మృత్యువాత పడుతుండటంతో మత్స్యకారుల్లో కొన్నిచోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటుండగా కొంతమంది ఏలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు వీలు లేక ఆందోళన చెందుతున్నారు. కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టి చేపల పెంపకం చేస్తున్న మత్స్యకారులు మాత్రం పెట్టిన పెట్టుబడి తిరిగి రాక అప్పుల ఊబీలో కూరుకుపోయి ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ చేపలు కూడా మత్స్యకారులు చెరువులో వదలడంతో నీరు అడుగంటుతుండటంతో వాటి సంరక్షణ కష్టంగా మారింది.

వీధినపడనున్న కుటుంబాలు

జగిత్యాల జిల్లాలో దాదాపు 18 వేల మంది మత్స్యకారులు చేపల పెంపకంపైనే ఆధారపడి ఉన్నారు. వీరంతా ఆయా గ్రామాల్లో ఉన్న చెరువులు, కుంటల్లో చేపలు పెంచుకుని వీటిని అమ్ముకుని జీవనం కొనసాగిస్తారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో వారికి చేపలు పెంచే వీలులేకపోవడంతో పాటు చెరువులు ఎండిపోతుండటంతో వారికి ఉపాధి దెబ్బతినడంతో పాటు పెట్టిన పెట్టుబడి రాక మార్కెట్‌లో చిన్న చేపలు ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు.

చెరువుల్లో చేపలు పడుతున్నారు



జిల్లాలో ఎండలు తీవ్రంగా ఉండటంతో చాలా చెరువులు, కుంటల్లో నీటిమట్టం పడిపోయింది. నీటి మట్టం తక్కువ ఉన్న చెరువులు, కుంటల్లో చేపలను మత్స్యకారులు పట్టుకుని విక్రయిస్తున్నారు. మత్స్యకారులు ఎండుతున్న చెరువుల్లో చేపలు చనిపోకుండా కొన్ని చోట్ల ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

– దామోదర్, జిల్లా మత్స్యశాఖ అధికారి

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత



లక్ష్మీపూర్‌లో ర్యాలీలో పాల్గొన్న జెడ్పీ సీఈవో



గోధూర్‌లో మొక్కలు నాటుతున్న ఎంపీపీ భీమేశ్వరి

జగిత్యాలరూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జెడ్పీసీఈవో రఘువరణ్ అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లక్ష్మీపూర్‌లో అమృత్ సరోవర్ ట్యాంక్ వద్ద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడంతో పాటు, వాటి ఎదుగుదలకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్, ఆశావర్కర్లు, వీవోలు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీవో గంగలక్ష్మణ్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో బుధవారం పచ్చదనం పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీఏ శైలజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగిత్యాల: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వృక్ష సంపదను కాపాడుకోవాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని జాంబాగ్‌లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కవితరాణి, జానకి, ఉజ్వల, రజిని పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్ అన్నారు. బుధవారం కళాశాలలో పర్యావరణంపై సమావేశంలో మాట్లాడారు. పర్యావరణం కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే పర్యావరణం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కరుణాకర్, హరితహారం కో–ఆర్డినేటర్ రాధకిషన్, ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

పెగడపల్లి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్ పేర్కొన్నారు. బుధవారం గ్రామాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీలు నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ జాజాల భీమేశ్వరి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గోధూర్ గ్రామశివారులోని పెద్దమ్మ కుంట వద్ద మొక్కలను నాటారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజన్న, నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

మేడిపల్లి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మేడిపల్లి,భీమారం మండలాల్లోని పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు పర్యావరణంపై అధికారులు అవగాహన కల్పించారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

పెగడపల్లి: మండలంలోని పలు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం అధికారులు పరిశీలించారు. పెగడపల్లి మోడల్ స్కూల్, అయితిపల్లి పాఠశాలలను ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, ఎంపీవో మహేందర్ పనులను పర్యవేక్షించి పనుల్లో వేగం పెంచి, పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవి, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ వారి వెంట ఉన్నారు.

బీజేపీకి భారీ మెజార్టీపై హర్షం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

కోరుట్ల: నియోజకవర్గంలో బీజేపీకి భారీ మెజార్టీ రావటం పట్ల ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలో బుదవారం మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలో బీజేపీకి 33 వేల మెజార్టీ రావటం బీజేపీపై ప్రజల్లో ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. బీజేపీని ఆదరించిన ప్రతీ ఓటరుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ



విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

కథలాపూర్: మండలంలోని ఊట్‌పెల్లి, పెగ్గెర్ల గ్రామాల్లో బుధవారం ప్రభుత్వ ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. ఆయా వాడల్లో తిరిగి విద్యార్థుల అడ్మిషన్లు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య, యూనిఫాం, పుస్తకాలు, నోట్‌బుక్కులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అర్జున్, రాజశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ శర్మ, పరమేశ్వర్, వెంకటేశ్వర్లు, రవి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పోచమ్మ గుడి నిర్మాణానికి విరాళం



విరాళం అందిస్తున్న ప్రవాస భారతీయులు

కొండగట్టు: కొడిమ్యాల మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ గుడికి పలువురు ప్రవాస భారతీయులు రూ. 30 వేల విరాళం ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. మారుపాక సాయి కృష్ణ, గుడిపల్లి మహేశ్ సింగపూర్ నుంచి కొడిమ్యాలకు వచ్చిన కమిటీ సభ్యులను కలిశారు. సింగపూర్‌లో ఉంటున్న బైరి రవి, చల్ల కృష్ణ, నల్ల నరేందర్ రెడ్డి, గుడిపల్లి శ్రీనివాస్, చీకట్ల తిరుపతి, బైరి నిఖిల్, విరాళాలు అందజేసిన వారికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠ్యపుస్తకాలు వచ్చాయి

ఇబ్రహీంపట్నం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్యపుస్తకాలు బుధవారం ఎమ్మార్సీ కార్యాలయానికి చేరినట్లు ఇన్‌చార్జి ఎంఈవో ఆనందరావు తెలిపారు. 1 నుంచి 10వ తరగతికి చెందిన విద్యార్థులకు 15,091 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, 1125 పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీఆర్పీలు రవీందర్, శివరాం, ఎంఐఎస్ కార్తీక్, కంప్యూటర్ ఆపరేటర్ అశోక్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత

జగిత్యాలరూరల్: జీవనజ్యోతి యోజన ద్వారా ఖాతాదారులకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేలుమరుగన్ అన్నారు. బుధవారం జగిత్యాల బ్రాంచ్ కార్యాలయంలో కల్లెడ గ్రామానికి చెందిన మంచాల పుల్లవ్వ అనారోగ్యంతో మృతిచెందగా ఆమె కుటుంబానికి ఇన్సూరెన్స్ ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకు విత్తనాలు విక్రయించాలి



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో

పెగడపల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎరువులు, విత్తనాలు విక్రయాలు ఏవో విలీన డీలర్లకు సూచించారు. మండల కేంద్రంలోని పలు ఎరువులు, విత్తన దుకాణాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువులు, విత్తనాలు నాణ్యత, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. దుకాణాల్లో ఉన్న నిల్వలను తెలుపుతూ స్టాక్‌బోర్డులో నమోదు చేయాలని, రైతులకు కనపడేట్లు ధరల పట్టిక అమర్చాలన్నారు. రైతులకు తప్పనిసరిగా రశీదు అందించాలని డీలర్లకు సూచించారు.

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని డబ్బా, గోధూర్ గ్రామాల్లో బుధవారం ఫర్టిలైజర్ షాపులను మండల వ్యవసాయ అధికారి దీపిక ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ రకాల విత్తనాల బస్తాలను ఆమె పరిశీలించారు. దుకాణాలలో రశీదు పుస్తకాలను , స్టాక్ రిజిస్టర్‌లను , దుకాణా లైసెన్స్‌ను ఆమె తనిఖీ చేశారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో ఏఈవో నరేశ్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: అనారోగ్యానికి గురైన బాధితుడి వైద్య ఖర్చుల కోసం 2.10 లక్షల విలువ గల ఎల్‌వోసీని బాధిత కుటుంబానికి బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అందజేశారు. మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన గజ్జెల రాజేశం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరాడు. బాధిత కుటుంబానికి విప్ ఎల్‌వోసీ అందజేశారు.

‘నీట్’ లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల టౌన్: పట్టణానికి చెందిన కోగిల రిషిక్, ఎక్కల్‌దేవి ఉమేష్ చంద్ర, దొనకొండ సాయితేజ నీట్ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో కోగిల రిషిక్ 720 మార్కులకు 563 మార్కులు, ఎక్కల్‌దేవి ఉమేశ్ చంద్ర 495 మార్కులు, దొనకొండ సాయితేజ 484 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

రాయికల్: పట్టణానికి చెందిన జక్కుల కీర్తన నిట్ పరీక్షలో ప్రతిభ సాధించింది. 720 మార్కులకు గాను 582 మార్కులు, వీరాపూర్ గ్రామానికి చెందిన చెదలి హరీశ్‌బాబు 523 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను బుధవారం పలువురు అభినందించారు.

ధర్మపురి: ధర్మపురికి చెందిన ఇద్దరు విద్యార్థినులు నీట్ ఫలితాల్లో సత్తా చాటారు. వీరిలో ఒకరు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కూతురు కాగా, మరో విద్యార్థిని రైతు బిడ్డ. ధర్మపురికి చెందిన చిలువేరు ఉమాదేవి కూతురు హిమద్యుతి 652 మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 27,341, ఓబీసీ కేటగిరిలో 12,285 ర్యాంకు సాధించింది. మండలంలోని ఎడపెల్లికి చెందిన పత్తి మోహన్ నాగలక్ష్మి దంపతుల కూతురు పత్తి అక్షిత నీట్‌లో 483 మార్కులు సాధించింది. డాక్టర్ కావాలనే తమ తల్లిదండ్రుల ఆశయం మేరకు చదివి వారి కలలు నిజం చేస్తామని విద్యార్థినులు తెలిపారు.

కొండగట్టులో ఎమ్మెల్యే పూజలు



ఎమ్మెల్యేకు ఆశీర్వచనం ఇస్తున్న అర్చకులు

కొండగట్టు: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదినం సందర్భంగా బుధవారం కొండగట్టు ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయన గోత్రనామాలపై ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదం, ఆశీర్వచనం అందించారు.

మున్నూరుకాపు రేచపల్లి నూతన కార్యవర్గం

సారంగాపూర్: మండలంలోని రేచపల్లిలో బుధవారం మున్నూరుకాపు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వోడ్నాల రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడిగా బొర్ర గంగమల్లు, కార్యదర్శిగా బాస మల్లయ్య, జంగిలి జగన్, కోశాధికారిగా లెక్కల శేఖర్, దీటి సత్తెన్న , చక్రపు భూమన్న, సిలివేరి మల్లేష్, బందెల శ్రీనివాస్, ఆకుల తిరుపతి, దీటి గంగన్నలు ఎన్నికయ్యారు. మున్నూరు కాపు సంక్షేమం, అభివృద్ధి కోసం కృషిచేస్తామని నూతన కార్యవర్గ సభ్యులు పేర్కొన్నారు.

మున్నూరుకాపు తాట్లవాయి అధ్యక్షుడిగా చెట్లపల్లి రాజు

రాయికల్: మండలంలోని తాట్లవాయి మున్నూరు కాపు అధ్యక్షుడిగా చెట్లపల్లి రాజు బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రంజిత్, మహిపాల్, మహేశ్, శేఖర్, గంగారెడ్డి, మల్లేశం, నాగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విత్తనాలు

ఇబ్రహీంపట్నం : మండలంలోని రైతులకు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి దీపిక బుధవారం తెలిపారు. ఇబ్రహీంపట్నం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 102 బస్తాలు, మండలంలోని గోధూర్ డీసీఎంఎస్‌లో 75 బస్తాలు జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు తీసుకోవాలని ఏవో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జగిత్యాలరూరల్: మండలంలోని కల్లెడ సబ్‌స్టేషన్ పరిధిలోని అనంతారం, గుట్రాజ్‌పల్లి, తక్కళ్లపల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఏఈ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పట్టణంలోని వాణీనగర్, తులసీనగర్, బీట్‌బజార్, గీతావిద్యాలయం, నటరాజ్ చౌరస్తా, బసవేశ్వరకూడలి, ఇస్లాంపుర, నిజామాబాద్‌రోడ్, పురాణిపేటలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–3 ఏఏఈ రహీం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బుగ్గారం: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ బాదినేని రాజమణి ఆధ్వర్యంలో రేపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.శ్రీనివాస్ తెలిపారు. సమావేశం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం అవుతుందని అన్ని శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగులో నిర్వహిస్తున్న పీపీఎల్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఫైనల్‌లో ఎంబీఆర్ వారియర్స్ జట్టు పై తిరుపతి 11 జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు


బుగ్గారం: పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన గడ్డం వంశీకృష్ణ గెలుపొందగా మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. చిన్నాపూర్,చందయ్యపల్లె గ్రామాల్లో స్థానిక నాయకులు,కార్యకర్తలు బాణాసంచా పేల్చి,స్థానికులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వంశీ గెలుపుతో పెద్దపల్లి నియోజకవర్గం రానున్న రోజుల్లో గణనీయమైన అభివృద్ధి సాధించనుందని, గెలుపునకు సహకరించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎన్నం కిషన్‌రెడ్డి, గట్టు గంగారాం, గాదె ప్రభాకర్, బుర్ర రమేశ్, పూజల కనకయ్య, చల్లా తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



పోచమ్మతల్లికి బోనాలు

రాయికల్: మండలంలోని సింగరావుపేటలో బుధవారం వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో మహిళలు పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

తవ్వితే పొక్కులు వస్తున్నాయి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: కాంటూర్ కందకాల్లో తవ్వితే పొక్కులు వస్తున్నాయని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గోధూర్‌లో కాంటూరు కందకాల తవ్వకాన్ని బుధవారం ఎంపీపీ జాజాల భీమేశ్వరి పరిశీలించారు. వర్షాలు లేక భూమి గట్టిగా ఉండి తవ్వితే తమ చేతులకు పొక్కులు వస్తున్నాయని ఎంపీపీకి ఉపాధి కూలీలు చూపించారు. బలవంతంగా తవ్వించొద్దని వేరే చోట పనులను చేయించాలని కోరారు. గురువారం నుంచి మరో చోట కూలీలతో పనులు చేయిస్తామని అధికారులు హామీ ఇచ్చినట్లు ఎంపీపీ తెలిపారు.

వెల్గటూర్‌లో పిచ్చికుక్క స్వైర విహారం

వెల్గటూర్ : మండల కేంద్రంలో బుధవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఒకే రోజులో 10 మందిపై దాడిచేసింది. పిచ్చికుక్క దాడిలో గాయపడిన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య చికిత్స అందించారు. గ్రామస్తులు ఆ పిచ్చికుక్కను చంపేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, గతంలో చిన్న పిల్లలపై, పెంపుడు జంతువులు, కోళ్లపై దాడిచేస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేదని గ్రామస్తులు అంటున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన మాదాసు విశ్వజ ఇంట్లో గుర్తుతెలియని దొంగలు పడి నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. ఈనెల ఒకటిన విశ్వజ ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. బుధవారం ఉదయం తాళం పగులగొట్టి ఉందన్న స్థానికుల సమాచారం మేరకు విశ్వజ వచ్చి పరిశీలించింది. ఇంట్లోని నాలుగు తులాల బంగారాన్ని గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. వెండి ఆభరణాలను తీసుకెళ్లలేదు. దీంతో బాధితురాలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు బాధితురాలి ఇంటికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

కోరుట్లలో..

కోరుట్ల: కోరుట్లలోని ఆనంద్‌నగర్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. ఆనంద్‌నగర్‌లో నివాసముండే పందిరి మురళి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని తులంనర బంగారం, 5 తులాల వెండి , రూ.లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువు శిఖాన్ని కాపాడాలి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కండ్లపల్లి–చెర్లపల్లి గ్రామాల శివారులోని ఘంటన్న చెరువు ఆక్రమణకు గురవుతోందని, దీనిని నిలువరించి, కబ్జా చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కండ్లపల్లి–చెర్లపల్లి గ్రామాల మధ్య రోళ్లవాగు ప్రాజెక్టు దిగువన ఉన్న ఈ చెరువు కింద దాదాపు 400 ఎకరాలకు చెరువు ద్వారా సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. చెరువు శిఖం దాదాపు 30 ఎకరాల్లో ఉంటుందని, కొంత మంది చాలా రోజులుగా భూమిని చదును చేసి సాగుచేస్తున్నారని, చెరువు విస్తీర్ణం రోజురోజుకు తగ్గిపోతుందని దీంతో నీటి నిలువ సామర్థ్యం తగ్గుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో చెరువు శిఖం పూర్తి అన్యాక్రాంతమవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్స్ డిజేబుల్ పర్సన్స్ ఆధ్వర్యంలో జిల్లాలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు, వీటిని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కృష్ణతేజ అన్నారు. బుధవారం సారంగాపూర్ మండలం కోనాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించి,100 మందికి ఉచిత పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అరుణకుమారి,లక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన వెంకట్రాములు మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థికసాయం కోసం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను సంప్రదించగా, రూ.1.80 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించినట్లు మండల కాంగ్రెస్ నాయకులు పులి హరిప్రసాద్ తెలిపారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కథలాపూర్: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2007–08లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమావేశం బుధవారం కథలాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఆహ్వానించి శాలువాలతో సన్మానించారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకుని, ఆడుతూ పాడుతూ ఆనందోత్సవాల మధ్య గడిపారు. సామూహికంగా భోజనాలు చేసి, పూర్వ విద్యార్థులందరూ ఒకరికొకరు ఆటోగ్రాఫ్ తీసుకొని మళ్లీ కలుద్దామని సమావేశాన్ని ముగించేశారు.